
# కల: పీడకల



మధిర భానుమూర్తి

కథానిక

"అయ్యో! రాత! అడక్క అడక్క మా అల్లుడి సంపాదనను గురించే అడిగారూ! ఏం చెప్పమంటారు?...సిగ్గుచేటు కూడాను." అంది రామాయమ్మగారు తన అల్లుడి సంపాదనను గురించి అడిగిన సీతమ్మతో.

"అదేమిటండీ! నెలకు రెండువందలు సంపాదించే అల్లుణ్ణే మీరు అలాఅంటే ఇంక మా అల్లుళ్ళను గురించి ఏమనుకోవాలండి!" అంది సీతమ్మ.

"సంపాదనలో ఏముందమ్మా! రెండు వందలొచ్చినా ఒకటే, నాలుగు వందలొచ్చినా ఒకటే. ఎందుకూ! ఏమైనా రాణింపా, ఏమన్నానా? ఆయింట్లో వేలకువేలు సంపాదించినా ఏమీ లాభంలేదు. అదోక మహాసముద్రం. ఎంతతెస్తే మట్టుకూ మిగులుతుందా, చస్తుందా? పైగా 'ఇదిలేదు' 'అదిలేదు' అని నిత్యం ఇంట్లో కోసేవాళ్ళే అతన్ను ఎందరినని తృప్తిపరచగలడు? వచ్చే రెండువందలు వాళ్ళ ముఖాన్నే గుమ్మరించినా ఆ కోపంలో ఎప్పుడూ రుసరుసలే, అయినా ఒకరిననుకుని ఏంలాభం? ఇంతకీ మా సుశీలరాత అలాఉంది. మీఅల్లుడు వందే సంపాదిస్తేనేమండీ! అమ్మాయి, అతను చక్కగా చిలకాగోరింకల్లాగ కాపరం చేసుకుంటుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది చూసేందుకు. మేమెవరమేనా ఎప్పుడైనా పిల్లని చూద్దామని వెడితే ఎంత సణుగుడనుకున్నారు ఆ కొంపలో! అమ్మో! అంతా ఇంతాకాదు. అలాంటికొంపలో ఇంక దానికి సుఖమెక్కడిది చెప్పండి?"

"పోనీ వేరే కాపరం పెట్టమని చెప్పక పోయారా అంత కష్టంగా ఉన్నప్పుడు. కొంచెం కష్టంగా ఉన్నా కలిసిఉండడమే మంచిదండీ! నేను చూస్తున్నానుగా! మా అల్లుడికి వచ్చే వందలో ఇంటిఅద్దెకనీ, పనిమనిషనీ, చాకలనీ, ఏదో కనిపించనిఖర్చు బోలెడంత అయిపోతోంది. అక్కడే ఉంటే ఈ ఖర్చులన్నీ ఉండవుగదా! మా అల్లుడిలాగ పొరుగూళ్ళో ఉంటే ఎలాగూ తప్పదుగాని ఊళ్ళోనే ఉద్యోగమైనప్పుడు వేరే కాపరం పెట్టడం అంతమంచిదికాదనుకుంటాను. వేరుకాపరం పెట్టించి నేను అనుభవించానుగా!" అని తన అనుభవాన్ని చెప్పింది సీతమ్మ.

"అయ్యో! పిన్నిగారూ! దూరపుకొండలు నునుపు అన్నట్టు మీకు అలా అనిపిస్తోంది గాని కలిసిఉంటే ఎన్నిబాధలండీ! అందరూ ఊరుకుని మా అమ్మాయిచేత ఎంతపని చేయిస్తున్నారని! అసలు మిగిలినవాళ్ళెవరేనా చిన్నపనేనా చేస్తేనా! ఏమీ చెయ్యరు! వాళ్ళకి ఆరుగురు ఆడపిల్లలున్నారు. అంతా పెళ్ళికావలసినవాళ్ళే! ఒక్కత్తె అయినా నడుంవచ్చిన పాపాన పోతేనా! అసలు వాళ్ళ సింగారాలకే చాలదు కాలం. ఇంకవాళ్ళు పనులేంచేస్తారు? వాళ్ళకందరికీ అన్నీ అమర్చిపెట్టలేక మా అమ్మాయి ఎంత కష్టపడుతోందనీ! ఇవ్వి బయటివాళ్ళకేం తెలుస్తాయమ్మా? ఇది ఎంతపెద్దకోడలైతే మాత్రం - తనకన్న బాగా కుర్రపిల్లేగదా, తనపిల్లలకి పెళ్ళిళ్ళుచెయ్యాకగాని అసలు ఇది వాళ్ళరెండోపిల్లకన్న రెండునెలలు చిన్నేగదా, ఆమాత్రం ఆలోచన ఉండక్కర్లేదే!

తగుదునమ్మా అని, కాపరానికొచ్చిన మర్నాడే, వంటిల్లు దీనికప్పజెప్పి తను తప్పుకుంటుందా? ఆవిడ కేమయినా జ్ఞానముందంటారా? ఆవిడకొచ్చిన ఏళ్లు ఎవరికొచ్చాయి? ఎందుకండీ! చెప్పాలంటే ఎన్నైనా ఉన్నాయి. ఎన్నని చెప్తే తరగను! కుర్రది ఎవరితో చెప్పుకోగలదు? తల్లినిగనక నాదగ్గరచెప్పుకు ఏడ్చింది. నేను అప్పుడు చెప్పాను - ఊరుకుంటే లాభంలేదు. మీ ఆయనతో చెప్పి వేరుకాపరం పెట్టించు - అని, అయితేనేం, ఇంకా అది పసిపిల్ల. మనమంటే ఇన్నేళ్ళు కాపరం చేశాంగనక అవసరమైతే ఎదురు చెప్పగలం. దానికంత ధైర్యమెక్కడిది? ఈమాట అతనితో చెప్పేందుకు భయపడుతుంది, ఆఖరికి ఒకసారి నేనేచెప్పాను. అతను సంపాదనైతే సంపాదిస్తాడు, వీధులోనైతే పులిలాగ ఉంటాడు గాని ఆతల్లిదగ్గిర మాత్రం వత్తిపిల్లిపిల్ల. ఆవిడ ఎంత చెప్తే అంత. ఏపని చెయ్యాలన్నా ఆవిడ సలహా కావలిసిందే ఈయనకు. అలాంటి మనిషి ఏమంటాడు? మా అమ్మతో కూడా సంప్రదించాలన్నాడు. నాకు ముందే తెలుసు ఆవిడనడిగితే ఆవిడ ఏమంటుందో. అందుకని అన్నాను అతనితో- 'ఈమాత్రానికి ఒకళ్ళతో ఆలోచించేదేమిటోయ్! పైగా నీ అంతటివాడివి నువ్వు. ఇంక నీ వ్యవహారాలు నువ్వు స్వతంత్రించి చూసుకోవాలిగాని, ఇంతవాడవైనాక నీకు ఏది మంచో, ఏది చెడో అన్నవిషయం కూడా, ఎవరో నిర్ణయించాలంటే బాగుండదబ్బాయ్' అని — నేను ఏవంటే ఏంలాభం? నామాటవెలితే మిగిలింది గాని అతను చెయ్యదలచుకున్నది కాస్తా చెయ్యనే చేశాడు. ఫలితం నాకు తెలియదూ! ఆ యిల్లాలు, ఆ మహాతల్లి...అననే అంది, "అలా చెయ్యటం కన్న అఘాయిత్యం మరొకటిలేద"ని అవును మరి! ఆవిడదృష్టిలో అది అఘాయిత్యమే. వీళ్ళు వేరే కాపరముంటే ఇంట్లో చాకిరీ అంతా తనమీదా తన పిల్లలమీదా పడదూమరి! అది ఆవిడబాధ. ఏమయితేనేం! పడనిచ్చింది కాదు. కాని మంచి గడసరి, పైకి ఆమాట అంటుందా!...ఎప్పుడూ అనదు" అదికాదురా నాయనా! నీకు ఈఊళ్లోనే ఉద్యోగమయి ఉండి, ఇక్కడే నువ్వువేరే కాపరం పెడితే నన్నూ నిన్నూ నలుగురూ ఆడిపోసుకోరూ! అయినా అంత భరించలేని కష్టం నీకేంవచ్చిందిరా? ఏదో నలుగురం కలిసిఉండి ఉన్నదేదో తిని కాలక్షేపం చేద్దాం. అంతేగాని నువ్వు వెడితే మన సంసారం వీధికెక్కదూ?" అంటూ తియ్యగానే కబుర్లు చెప్పింది. నాకూ ఆ మాటలువింటే నిజమే ననిపించింది. ఇప్పుడు గనక వేరేకాపరం పెట్టించానంటే నేను వీధిని పడవలసి వస్తుంది. ఇంతకీ చెయ్యకలిగిందేమీలేదు. ఎప్పటికేనా ఆ దేవుడు మాయందుండి అతనికి బదిలీ అయితే తప్ప, లేకపోతే ఆ ఊళ్ళో ఉన్నంతకాలం ఆ యింట్లోనే వాళ్ళు ఉండాలి. ఆ సత్రపుకయ్యే ఖర్చులన్నీ అతనే భరించాలి." అంటూ చెప్పుకుపోతోంది రామాయమ్మ.

రామాయమ్మని అందుకనే ఎవరూ సాధారణంగా కదపరు. కదిపితే అనంత ప్రవాహంలా ఆవిడ మాట్లాడుతూనే ఉంటుంది. ఈ విషయం పెద్దది, ఈ విషయం చిన్నదీ అనే బాధ ఆవిడకేమీలేదు. అన్ని విషయాలను గురించి సమానంగానే మాట్లాడగలదు ఆవిడ. వినేవాళ్ళకి ఓపిక ఉంటే ఈ సంగతి సీతమ్మగారికి తెలియకపోలేదు. కాని ఏమీ కాలక్షేపం కానప్పుడు ఈవిడదగ్గరకు రావడం ఆ వీధివాళ్ళందరికీ అలవాటే! అందులోనూ ఆవిడ కూతురు అత్తవారి విషయమైతే మరీ ఉత్సాహంగా మాట్లాడుతుంది. అది తెలిసి ఉండబట్టే సీతమ్మగారు ఆ విషయం కదిపింది.

రామాయమ్మగారి కూతురు సుశీలకూడా తల్లికి ఏమాత్రం తీసిపోదు. కొన్ని విషయాల్లో తల్లిని మించిందికూడా. అల్లుడు చెప్పిన మాటల్లో కొంత కాకపోతే కొంతైనా సబబు ఉందని రామాయమ్మగారేనా వప్పుకుంటుంది కాని సుశీల మాత్రం వప్పుకోదు. "నిజమేనే!... మీ ఆయనకు ఏ ఊరేనా బదిలీ అయ్యేట్టు చూసుకోవాలిగాని ఆ ఊళ్ళోనే ఉద్యోగంచేస్తూ అక్కడ ఉండకపోతే బాగుండదు." అని రామాయమ్మగారు ఎన్నో విధాలచెప్పి చూసింది. "నీకేం తెలియదులేవే అమ్మా" అనేసింది సుశీల.

నిజంచెప్పాలంటే కాపరానికొచ్చిన మరునాటి నుంచీ సుశీలకి కన్నెర్రగానేఉంది తన భర్త సంపాదన అంతా అత్తవారి కుటుంబానికని ఖర్చయిపోతోందని. "ఏమండీ! ముందు వెనకలు ఆలోచించకుండా వచ్చిన డబ్బంతా అలా ఖర్చు చేసు

కుంటే అవసరానికి కావలిస్తే చేతిలో కానీ ఉండదు. ముగ్గురు మనుష్యులకి రెండు వందల రూపాయలు చాలటంలేదంటే విన్నవారు నవ్వరు టండీ!" అంది భర్తతో అతను చంటిపిల్లాడికి సిల్కు చొక్కా కొననంటే.

"నీ ఉద్దేశం బ్రతకవలసిన వాళ్ళం మనమిద్దరమే నన్నా? ఇంక మా వాళ్ళంతా ఏమవాలని?"

"చూశారా! చూశారా! ఎంతమాట అంటు న్నారో! అమ్మయ్యో!...వచ్చేడబ్బు చాలటం లేదని మీరు అంటే నేను మాటవరసకి చెప్పాను కాని, నాకేం? అంతా మీ వాళ్ళకే ధార పొయ్యండి. నేనేం కాదన్నానా? నాకెంత కావాలి? నా పిల్లాడు, నేను ముష్టన్నా ఎత్తు కుంటాం లెండి. మా మాటకేం? పాపం! మీ వాళ్లు బాగా ఉంటేను. అదీ!..."అని మొదలుపెట్టింది.

ఈ బాధ పడలేక ఎక్కువకాలం వీధుల్లోనే గడిపి ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు. అదీతప్పే అయింది. "మీకేం! మహారాజులు! శుభ్రంగా పగలంతా వీధుల్లో తిరిగివస్తారు. హాయిగా కాలం గడుస్తుంది మీకు. నాకేం ఉంది? రోజల్లా ఈ కొంపలోనే గడపమని రాసిపెట్టేడు భగవంతుడు. ఇదంతా నా ఖర్మ" అని స్వరంవేసి ఏడ్చేది.

"చిన్నపిల్లల మొదలు ఇహనో ఇప్పుడో అన్నట్టున్న ముసలాళ్ళదాకా నామీద హయాము లేనాయె! మా సంపాదన తింటూ మా మీద హయాములు చెయ్యసరి! అందరికీ మనుసులే! వీధులోకి ఏ వస్తువేనా అమ్ము రావటం భయం. ఇంటిల్లిపాదీ పొలికేక ఒకటి పేస్తారు. ఎవరిని ఏమంటాం? పోనీ వాళ్ళదగ్గిర డబ్బుందా అంటే అది మాత్రం ఏదీ? దానికి నా డబ్బే కావాలి, డబ్బయితే లేదుగాని పిలవటాలికి ముందు తయారు. డబ్బులేనివాడు ఓడముందెక్కినట్టు!" అని సణుగుడు మొదలుపెడుతుంది అతను ఇంటి కొచ్చేసరికి.

ఈ హంగామా అంతా ప్రతిరోజూ చూస్తున్న సుశీల అత్తగారు కామాక్షి తన కొడుకును పిలిచి నెమ్మదిగా చెప్పింది. "నాయనా! మీ ఆవిడకి ఇక్కడ ఉండడం ఇష్టంలేదు. నువ్వు మరో ఇల్లు ఎక్కడేనా అద్దెకు తీసుకుని ఉండు. మా పాట్లు ఏవో మేం పడతాం" అని,

"అది కాదే అమ్మా" అని ఏదో అనబోయా డతను. అతనిమాట కడ్డువచ్చి "నాకన్నీ తెలుసు నురా! నే చెప్పినట్లు చెయ్యి! ఇప్పు డిదొకటే మార్గం. ఇంతా సంపాదించుకుని ప్రాణానికి సుఖం లేకపోయాక ఎందుకురా!" అంది.

మరో ఇల్లు అద్దెకు తీసుకుని అందులోకి మారడం వెంటనే జరిగింది. ఆ ఇంటికి అద్దె నలభై రూపాయలు. అది కామాక్షిగా రింటికి అంత దూరమూ కాదు. అంత దగ్గిరకాదు. ఇక్కడికి వచ్చిన తరువాత సుశీల మొదట కొన్నిరోజుల పాటు సంతోషంగానే ఉంది. కాని ఒక నెల గడిచి ఖర్చులు తేలేసరికి గాబరా పట్టుకుంది. ఇక్కడికొచ్చాక అన్నీ ఖర్చులే. అక్కడ రెండు వందలు ఇంటిల్ల పాదికీ సరిపోయేది. ఇక్కడ ముగ్గురికి చాలటంలేదు. బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి అన్నీ కొనవలసి వస్తోంది. కనిపించని ఖర్చు బోలెడవుతోంది. మొదటి నెలలో దూబరాగా ఖర్చుపెట్టా ననుకుని రెండవ నెలలో జాగ్రత్తగా ఉండాలనుకుంది. ఆ నెలలో కూడా అంత ఖర్చూ అయేసరికి ఆమెకు మతిపోయినట్టయింది. ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోవటం లేదు. చివరకు ఒకే ఒక ఆలోచన తట్టింది. అవును అలా ఆలోచిస్తే నాలుగు డబ్బులు వెనకవేసుకోవచ్చునని తోచింది,భర్తకు సవిస్తరంగా చెప్పిందితనఆలోచన.

"ఏమండీ! మనం బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి కొనుక్కోవడం అంత బాగుండలేదు. ఎలాగూ మీవాళ్ళదగ్గిర ధాన్యం ఉండనే ఉంది. అక్కడి బియ్యం తెప్పించుకోవచ్చు. ఇక పాల విషయం-మీవాళ్లకి శుభ్రమైన పాడి ఉండికూడా మనం పాలు, పెరుగు కొనుక్కోవడం ఎంత చిన్నతనమండీ! అదీకాక, అంతా అడుగుతున్నారు కూడాను. "మీ అత్తారికి పాడి ఉండగా ఇదేం ఖర్మవమ్మా-ఈ నీళ్ళ పాలూ, నీళ్ళ మజ్జిగ కొను క్కోవడం?" అని. నేను వాళ్ళకేం జవాబు చెప్పను చెప్పండి"? అంది గారంగా.

"ఆ అడిగినవాళ్లు అదొక్కటేనా అడుగు తారు శుభ్రమైనది మీ అత్తారిల్లు ఉండగా ఇదేం ఖర్మవమ్మా ఇలా అద్దె కొంపలో వేరే కాపరం పెట్టడం? అని అడగలేదూ? ఈ పట్టు నిన్ను

(తరువాయి 41-వ పేజీలో)